పోరు తెలంగాణ
పత్రిక ప్రకటనల కోసం
మరియు
చందాదారులుగా
చేరండి చేర్పించండి
వివరాలకు
సంప్రదించండి సెల్
8555918136

# పోరు తెలంగాణ
డిజిటల్ తెలుగు దినపత్రిక




కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 గురువారం 01-10-2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వెల : 04

## ఖమేనీ అంత్యక్రియలకు మోదీ దూరం

భారత్ తరఫున వెళ్లేది వీరే..!

- ఖమేనీ అంతక్రియలు ప్రారంభం
- ఆ సమయంలో ఇండోనేషియా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా పర్యటనకు మోదీ
- ముందే ఖరారైన షెడ్యూల్ కారణంగా అంత్యక్రియలకు ప్రధాని దూరం
- భారత్ తరఫున బిహార్ గవర్నర్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి
- ఖమేనీ ఖననం



ఇరాన్ దివంగత మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకావడం లేదు. ఆయన స్థానంలో బీహార్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అతా హస్నైన్, కేంద్ర విదేశాంగ శాఖ - మిగతా 2 లో

## అమెరికా దాచిన నిజం?.. ఇరాన్ దాడులతో భారీ నష్టం!

- అమెరికా స్థావరాలకు భారీ నష్టం జరిగిందన్న నివేదిక
- బహ్రెయిన్‌లోని నౌకాదళ స్థావరానికి తీవ్ర దెబ్బ
- సైనిక స్థావరాల మార్పుపై పెంటగాన్ ఆలోచన
- పునర్నిర్మాణానికే 400 మిలియన్ డాలర్ల అంచనా
- మొత్తం యుద్ధ వ్యయం 40 బిలియన్ డాలర్లకు చేరినట్లు అంచనా



ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడుల వల్ల పశ్చిమాసియాలో అమెరికా సైనిక స్థావరాలకు అధికారికంగా వెల్లడించిన దానికంటే చాలా ఎక్కువ నష్టం జరిగిందని ఓ నివేదిక వెల్లడించింది. దీంతో ఆ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాల భద్రత, - మిగతా 2 లో

## మూసీ ప్రాజెక్టులో ఎవరికీ అన్యాయం జరగదు



- మూసీ ప్రాజెక్టు భూసేకరణ, పునరావాసం అంశాలపై పొంగులేటి సమీక్ష
- ఇళ్లు కోల్పోయే వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని ఆదేశం
- భూములు కోల్పోయే రైతులకు పరిహారం, పునరావాసం కల్పిస్తామని వెల్లడి

మూసీ నది పునరుద్ధరణ ప్రాజెక్టులో ఎవరికీ అన్యాయం జరగనీయబోమని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. - మిగతా 2 లో

## కొడంగల్‌లో 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయి



వాటితోనే రేవంత్ గెలిచారా?: కవిత

- దేశ వ్యాప్తంగా ఎనిమిది సార్లు 'సర్' ప్రక్రియ జరిగిందన్న కవిత
- బోధన్ లో ఇప్పటి వరకు 7 వేల ఓట్లు తీసేశారని వెల్లడి
- హైదరాబాద్‌లో ఉండే చాలా మందికి ఏపీలో కూడా ఓట్లు ఉన్నాయన్న కవిత

తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)- మిగతా 2 లో

# రాముడు–శివుడిపై సీఎం రేవంత్ రెడ్డి కామెంట్స్

- జాతీయ రాజకీయాల్లో దుమారం
- ఉత్తర, దక్షిణ భారతదేశంపై సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలతో వివాదం
- తాము ద్రావిడులమని, శివభక్తులమని.. ఉత్తరాది వారు ఆర్యులని, రామభక్తులని వ్యాఖ్య
- హిందువులను విడదీసేందుకే రేవంత్ మాట్లాడుతున్నారని బీజేపీ ఆరోపణ
- రాహుల్ గాంధీ ఆదేశాలతోనే రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారని బీజేపీ విమర్శ




తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు జాతీయ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి.

## జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో పాల్గొన్న సీతక్క

- వీబీ జీ రామ్ జీ పథకంపై కేంద్రానికి అభ్యంతరాలను తెలియజేసిన సీతక్క
- కొత్త పథకం ప్రవేశపెడితే మొత్తం ఆర్థిక భారం రాష్ట్రంపైనే పడుతుందని వ్యాఖ్య
- పీఎం ఆవాస్ యోజన కింద తక్షణమే గృహాలను మంజూరు చేయాలని విన్నపం



వీబీ జీ రామ్ జీ పథకం 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయని మంత్రి సీతక్క కేంద్రానికి తెలియజేశారు. ఈరోజు ఢిల్లీలో జరిగిన జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో పాల్గొన్న ఆమె... తెలంగాణలో అమలు చేస్తున్న గ్రామీణాభివృద్ధి పథకాల వివరాలను కేంద్రానికి వివరించారు. జులై 2న వీబీ జీ రామ్ జీ పథకం కొనసాగించాలా? లేక కొత్త పథకం తీసుకురావాలా? అనే అంశంపై తెలంగాణ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని సీతక్క ప్రకటించారు. కొత్త పథకం ప్రవేశపెడితే 100 శాతం ఆర్థిక భారం రాష్ట్రంపైనే పడుతుందని, ఇది సమస్యాత్మకమని కేంద్రానికి తెలియజేశారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో - మిగతా 2 లో

## బంగారం కొనుగోళ్లు తగ్గించారు ప్రజలకు మోదీ ధన్యవాదాలు



- బంగారం కొనుగోళ్లు, ఇంధన వాడకం తగ్గించినందుకు ప్రజలకు మోదీ ధన్యవాదాలు
- పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రధాని చేసిన విజ్ఞప్తికి అద్భుత స్పందన
- సీషెల్స్ పర్యటన నుంచే 135వ మన్ కీ బాత్‌లో ప్రసంగించిన ప్రధాని
- ప్రజల ఐక్యత అంతర్జాతీయ వేదికపై దేశానికి బలమని వ్యాఖ్య

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం దృష్ట్యా తాను చేసిన విజ్ఞప్తికి స్పందించి, బంగారు - మిగతా 2 లో

## దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు



- దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం
- ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య
- ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ

రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ - మిగతా 2 లో

## మూడు నెలల్లో ఎన్నికలు రావొచ్చు డీఎంకే శ్రేణులకు స్టాలిన్ పిలుపు

- తమిళనాడులో రాజకీయాలు వేగంగా మారుతున్నాయన్న డీఎంకే అధినేత
- ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపు
- టీవీకే మిత్రపక్షాల సపోర్ట్‌తో అధికారంలోకి వచ్చిందన్న స్టాలిన్
- అందుకే ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందోనని అనుమానం
- టీవీకే హయాంలో అభివృద్ధి మందగించిందన్న మాజీ సీఎం




తమిళనాడులో రాజకీయ పరిణామాలు వేగంగా మారే అవకాశం ఉందని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అన్నారు. మరో ఐదేళ్లు ఎదురుచూడాల్సిన అవసరం లేదని, మూడు నెలలు లేదా ఆరు నెల్లలో ఎన్నికలు రావొచ్చని పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశారు. ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. చెన్నైలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాజీ మంత్రి

## బుల్లెట్ ట్రైన్ పేరుతో రియల్ ఎస్టేట్ దందా

బుల్లెట్ ట్రైన్ భూసేకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందన్న కేటీఆర్ బహదూర్‌పల్లి రైతుల వ్యవసాయ భూములను తీసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడి




శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వద్ద ప్రభుత్వ భూమి ఉండగా రైతుల భూములు ఎందుకని ప్రశ్న బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున రియల్

## ఏపీ డిజిటల్ భవిష్యత్తుపై చంద్రబాబు ఫోకస్

సునీల్ మిట్టల్‌తో కీలక భేటీ



- చంద్రబాబుతో భారతీ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ మిట్టల్ భేటీ
- రాష్ట్రంలో డిజిటల్ మౌలిక సదుపాయాలపై కీలక చర్చలు
- డేటా సెంటర్లు, కనెక్టివిటీ, అండర్ సీ కేబుల్‌పై ప్రధానంగా దృష్టి
- చర్చలు ఫలప్రదంగా సాగాయన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు - మిగతా 2 లో

## ఇక్కడున్నది మోదీ–చంద్రబాబు–పవన్ అని గుర్తుంచుకోవాలి

సీఎం చంద్రబాబు మాస్ వార్నింగ్

- మోదీ సహకారం, పవన్ హుషారుతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామన్న చంద్రబాబు
- గత ప్రభుత్వ హయాంలో 880 కి.మీ. సీసీ రోడ్లు వేశారన్న చంద్రబాబు
- మేం రెండేళ్లలో 6,500 కి.మీ. వేశామని వెల్లడి
- అభివృద్ధికి అడ్డుపడితే ఎంతమాత్రం సహించబోమని హెచ్చరిక
- స్థానిక ఎన్నికల్లోనూ కూటమిదే విజయం ఖాయమన్న చంద్రబాబు




కూటమి ప్రభుత్వం పేదలకు పట్టాభిషేకం చేస్తుంటే, మరికొందరు విధ్వంసంతో రక్తాభిషేకం చేస్తామంటున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే సహించే ప్రసక్తి లేదని, ఇక్కడ ఉన్నది మోదీ, చంద్రబాబు, పవన్ అని గుర్తుంచుకోవాలని ఆయన ఈ సందర్భంగా ప్రత్యర్థులను హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలోని విధ్వంసానికి, నేటి కూటమి ప్రభుత్వ వికాసానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు. ఉదయగిరి నియోజకవర్గంలో నిర్వహించిన 'పల్లె పండుగ–3.0' బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, తన అనుభవం,

వైద్య పరీక్షల కోసం భార్యతో

# కలిసి ముంబై వెళ్లిన పవన్ కల్యాణ్

మొదటిపేజీ తరువాయి – సంబంధించిన వైద్య పరీక్షల నిమిత్తం ఆయన ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రికి వెళ్లనున్నారు. ఈ పర్యటనలో ఆయన వెంట భార్య అన్నా కొణిదెల కూడా ఉన్నారు. గత కొంతకాలంగా పవన్ కల్యాణ్ రెండు భుజాలకు సంబంధించి 'రొటేటర్ కఫ్' గాయంతో బాధపడుతున్నారు. ఈ గాయం కారణంగా ఆయన భుజాల కండరాలు చిట్లినట్లు సమాచారం. ఎన్నికల ప్రచార సమయంలోనూ ఈ నొప్పితో ఇబ్బంది పడినప్పటికీ, ఆయన తన పర్యటనలను కొనసాగించారు. ప్రస్తుతం ప్రభుత్వ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో, పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే ఆయన ముంబైలోని ప్రముఖ ఆసుపత్రికి వెళ్లినట్లు తెలుస్తోంది. తాను వరుసగా సినిమాలు చేసిన సమయంలో తగిలిన గాయాలు ఇప్పుడు బాధిస్తున్నాయని పవన్ పలు సందర్భాల్లో చెప్పారు. ఇటీవల ఆయనకు సైనస్ శస్త్రచికిత్స కూడా జరిగింది.

# సీఎం చంద్రబాబు జిల్లాల బాట.. 5 రోజుల షెడ్యూల్ ఖరారు

మొదటిపేజీ తరువాయి – ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టడంతో పాటు, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఆయా జిల్లాల్లోనే బస చేయనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

**పింఛన్ల పంపిణీతో మొదలు..**

జులై 1వ తేదీన తన పర్యటనను సంక్షేమ కార్యక్రమంతో ప్రారంభించనున్నారు. 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలంలో పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. అనంతరం అదే రోజు తిరుపతి జిల్లా శ్రీ సిటీకి చేరుకుంటారు. అక్కడ ప్రముఖ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ హీరో మోటో కార్ప్ ఏర్పాటు చేయనున్న గ్లోబల్ పార్ట్స్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తారు. సుమారు రూ.750 కోట్ల పెట్టుబడితో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుండటం గమనార్హం. కార్యక్రమం అనంతరం సీఎం చంద్రబాబు తిరుపతిలోనే బస చేస్తారు.

**రాయలసీమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

జులై 2వ తేదీన తిరుపతి జిల్లా రైల్వే కోడూరులో "వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్" (ఎదీ + =ావీ +) ను ప్రారంభిస్తారు. అదే రోజు సాయంత్రం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగే జీఎస్‌డీపీ కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్‌కు హాజరవుతారు. ఈ కీలక సమావేశంలో నీతి ఆయోగ్ సభ్యులతో పాటు ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సభ్యులు కూడా పాల్గొననున్నారు. రెండో రోజు రాత్రి కూడా సీఎం తిరుపతిలోనే బస చేస్తారు. పర్యటనలో అత్యంత కీలకమైన ఘట్టంగా జులై 3వ తేదీన కడప జిల్లా పర్యటన ఉండనుంది. రాయలసీమ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన స్టీల్ ప్లాంట్ పనులకు జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లెలో ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారు. రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులను లాంఛనంగా ప్రారంభించి, ఈ ప్రాంత పారిశ్రామిక అభివృద్ధికి బాటలు వేయనున్నారు.

**సొంత నియోజకవర్గంలో మూడు రోజులు**

స్టీల్ ప్లాంట్ పనులను ప్రారంభించిన అనంతరం, చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పంకు బయలుదేరి వెళతారు. జులై 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు మూడు రోజుల పాటు కుప్పంలోనే ఉండి, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. నియోజకవర్గ ప్రజలతో మమేకమై, స్థానిక సమస్యలను తెలుసుకుంటారు. మూడు రోజుల కుప్పం పర్యటన ముగించుకుని జులై 5వ తేదీన తిరిగి అమరావతికి చేరుకుంటారు. ఈ ఐదు రోజుల పర్యటన ద్వారా ఒకేసారి సంక్షేమం, పారిశ్రామిక అభివృద్ధి, నియోజకవర్గ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది.

# ఏపీ డిజిటల్ భవిష్యత్తుపై చంద్రబాబు ఫోకస్

మొదటిపేజీ తరువాయి – నాయుడు కీలక సమావేశం నిర్వహించారు. ప్రముఖ టెలికాం దిగ్గజం భారతీ ఎంటర్‌ప్రైజెస్ వ్యవస్థాపక చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్‌తో ఆయన భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన కనెక్టివిటీని అందించడం, డిజిటల్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ చర్చలు సాగాయి. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సునీల్ మిట్టల్‌తో జరిగిన చర్చలు అత్యంత ఫలప్రదంగా సాగాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. "ఆంధ్రప్రదేశ్ డిజిటల్ మౌలిక సదుపాయాల బలోపేతం, పౌరులకు మెరుగైన కనెక్టివిటీని అందించడంపై నిర్మాణాత్మక చర్చలు జరిగాయి" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. మరోవైపు, విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న గూగుల్ ఏఐ డేటా సెంటర్ ప్రాజెక్టులో భారతీ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన ఎయిర్‌టెల్ నెక్స్‌ట్రా ఇప్పటికే భాగస్వామిగా ఉంది. భారీ పెట్టుబడులతో, స్వచ్ఛ ఇంధనంతో నడిచేలా రూపొందిస్తున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి 2026 ఏప్రిల్‌లో శంకుస్థాపన చేసేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఈ ప్రాజెక్టును 2028 సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇదివరకే భాగస్వామ్య సంస్థలను కోరారు.

# అమెరికా దాచిన నిజం?.. ఇరాన్ దాడులతో భారీ నష్టం!

మొదటిపేజీ తరువాయి – భవిష్యత్తుపై పెంటగాన్ పునరాలోచిస్తున్నట్లు తెలుస్తోంది. 'వాల్ స్ట్రీట్ జర్నల్' కథనం ప్రకారం.. ఫిబ్రవరి చివరి నుంచి జూన్ మధ్య జరిగిన ఇరాన్ దాడుల్లో పశ్చిమాసియాలో కనీసం 20 అమెరికా సైనిక స్థావరాలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా బహ్రెయిన్‌లో ఉన్న అమెరికా నౌకాదళ ప్రధాన స్థావరం 'నేవల్ సపోర్ట్ యాక్టివిటీ'కు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ దాడుల్లో కమాండ్ హెడ్‌క్వార్టర్స్‌తో పాటు డజనుకు పైగా భవనాలు, రెండు శాటిలైట్ కమ్యూనికేషన్ టెర్మినల్స్ దెబ్బతిన్నట్లు నివేదిక పేర్కొంది. దాడుల సమయంలో ఎక్కువ మంది సిబ్బందిని ముందుగానే తరలించినందున ప్రాణనష్టం జరగలేదని అమెరికా సైన్యం తెలిపింది. ఈ పరిణామాల నేపథ్యంలో బహ్రెయిన్‌లోని స్థావరాన్ని పునర్వ్యవస్థీకరించడం, కువైట్, సౌదీ అరేబియాల్లో ఉనికిని తగ్గించడం, ఇరాన్ క్షిపణుల పరిధికి దూరంగా కొన్ని సైనిక కార్యకలాపాలను పశ్చిమ ప్రాంతాలకు తరలించే అంశాలను పెంటగాన్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. అవసరమైతే భూగర్భ కమాండ్ కేంద్రాల ఏర్పాటుపైనా చర్చ జరుగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. నష్టపోయిన భవనాల పునర్నిర్మాణానికే సుమారు 400 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.3,400 కోట్లు) ఖర్చవుతుందని అంచనా. అయితే శిథిలాల తొలగింపు, అదనపు భద్రతా ఏర్పాట్ల ఖర్చు ఇందులో లేదని పేర్కొంది. ఇదే సమయంలో 'సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్' అంచనా ప్రకారం ఈ యుద్ధం వల్ల మొత్తం వ్యయం సుమారు 40 బిలియన్ డాలర్లకు చేరగా, అందులో 2.2 నుంచి 5.1 బిలియన్ డాలర్ల వరకు అమెరికా సైనిక స్థావరాలకే నష్టం వాటిల్లినట్లు వెల్లడించింది.

# మూసీ ప్రాజెక్టులో ఎవరికీ అన్యాయం జరగదు

మొదటిపేజీ తరువాయి – భూసేకరణ, పునరావాసం అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి... మానవీయ కోణాన్ని దృష్టిలో ఉంచుకుని భూసేకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇళ్లు కోల్పోయే కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని సూచించారు. భూములు కోల్పోయే రైతులకు తగిన పరిహారం, పునరావాసం అందించాలని, ఈ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్ నగరం మరింత అందంగా మారాలని, విస్తృతంగా అభివృద్ధి చెందాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ప్రాజెక్టు వల్ల ఏ ఒక్కరికీ ఇబ్బంది కలగకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# స్టాలిన్‌కు షాకిచ్చిన వైకో.. ఆయనకు ఝలక్ ఇచ్చిన సొంత పార్టీ నేతలు

మొదటిపేజీ తరువాయి – వైకో నేతృత్వంలోని ఎండీఎంకే తప్పుకున్న 24 గంటల వ్యవధిలోనే ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. ఎండీఎంకేకు చెందిన 150 మందికి పైగా ముఖ్య నేతలు, జిల్లా కార్యదర్శులు, ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు ఆదివారం డీఎంకే గూటికి చేరారు. చెన్నైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం 'అన్నా అరివాలయం'లో జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. వీరిలో శివగంగైకి చెందిన పులవర్ ఎస్. సేవంతియప్పన్, తిరువళ్లూరుకు చెందిన టి.ఆర్.ఆర్.సెంగుట్టువన్, ప్రచార కార్యదర్శి తిరుపరంకుండ్రం అళగుసుందరం, విరుదునగర్‌కు చెందిన ఆర్.ఎం.ఎస్. శేఖర్ వంటి ఎండీఎంకే అగ్రనేతలు ఉన్నారు. వీరితో పాటు డాక్టర్ అంబేద్కర్ లా యూనివర్సిటీకి చెందిన 40 మంది విద్యార్థి నేతలు కూడా డీఎంకేలో చేరడం గమనార్హం. ఈ ఆకస్మిక వలసలతో శివగంగై, తిరువళ్లూరు, విరుదునగర్, తిరుపూర్ వంటి కీలక జిల్లాల్లో డీఎంకే తన సంస్థాగత బలాన్ని మరింత పెంచుకుంది. అంతకుముందు శనివారం జరిగిన జనరల్ కౌన్సిల్ సమావేశంలో.. డీఎంకేతో ఉన్న తొమ్మిదేళ్ల బంధాన్ని తెంచుకుంటున్నట్లు ఎండీఎంకే ప్రకటించింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ప్రజాతీర్పుకు వ్యతిరేకంగా, అన్నాడీఎంకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు డీఎంకే తెరవెనుక రాజకీయ ఒప్పందాలు చేసుకుందని ఎండీఎంకే తీవ్ర ఆరోపణలు చేసింది. కూటమిలో తమకు తీవ్ర అవమానాలు జరిగాయని వైకో ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఒంటరిగానే నిర్ణయాలు తీసుకుంటామని, రాబోయే ఉప ఎన్నికల్లో ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వానికి మద్దతు ఇస్తామని ప్రకటించారు. అయితే ఎండీఎంకే చేసిన ఆరోపణలను డీఎంకే తీవ్రంగా ఖండించింది.

# కొడంగల్‌లో 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయి

మొదటిపేజీ తరువాయి – ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ హాట్ టాపిక్ గా మారింది. దీనిపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఇప్పటివరకు ఎనిమిది సార్లు 'సర్' ప్రక్రియ జరిగిందని తెలిపారు. బోధన్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 7 వేల ఓట్లు తీసేశారని... దీనిపై ఎన్నికల సంఘం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో కేవలం 800 ఓట్లను మాత్రమే తొలగించారని కవిత విమర్శించారు. కానీ తాము క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే.. అక్కడ ఏకంగా 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు తేలిందని అన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి 32 వేల మెజారిటీతోనే గెలిచారని.. ఈ డూప్లికేట్ ఓట్లతోనే ఆయన గెలిచారా? అనే అనుమానం తమకు ఉందన్నారు. సినీనటుడు ప్రకాశ్ రాజ్‌కు రెండు వేర్వేరు చోట్ల ఓట్లు ఉన్నాయని, వాటిని తొలగించడానికి ఏడేళ్ల సుదీర్ఘ సమయం పట్టిందని ఈసీని విమర్శించారు. హైదరాబాద్‌లో ఉండే చాలా మంది ఓటర్లకు అటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఓట్లు ఉన్నాయని, ఈ డూప్లికేట్ ఓట్లను తొలగించడంలో అధికారులు ఫెయిల్ అయ్యారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 'సర్' ప్రక్రియ జరుగుతున్నందున.. రాష్ట్రాల మధ్య ఉన్న ఓటర్ డేటాను లోతుగా పరిశీలన చేయాలని కవిత సూచించారు. ఒక పౌరుడికి దేశంలో ఎక్కడైనా ఒకే ఒక్క చోట మాత్రమే ఓటు ఉండేలా చూడాలని అన్నారు. డూప్లికేట్ ఓట్ల స్కామ్‌పై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

# బంగారం కొనుగోళ్లు తగ్గించారు.. ప్రజలకు మోదీ ధన్యవాదాలు

మొదటిపేజీ తరువాయి – కొనుగోళ్లు తగ్గించడంతో పాటు ఇంధనాన్ని పొదుపు చేసిన భారతీయులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ప్రసారమైన 135వ 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ సంక్షోభ సమయంలో ప్రజలు కనబరిచిన ఈ సహకారం దేశ ఐక్యతకు, శక్తికి నిదర్శనమని కొనియాడారు. ప్రస్తుతం సీషెల్స్ పర్యటనలో ఉన్న ప్రధాని, అక్కడి నుండే ఈ కార్యక్రమం ద్వారా దేశప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. దేశ ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అనేక కుటుంబాలు నూతన బంగారు ఆభరణాల కొనుగోళ్లకు దూరంగా ఉండి, వివాహ వేడుకలకు పాత బంగారాన్నే పునర్వినియోగించడం అభినందనీయమన్నారు. అలాగే, అనేకమంది తమ విదేశీ పర్యటనలను వాయిదా వేసుకోవడం, కార్‌పూలింగ్ పాటించడం మరియు మెట్రో వంటి ప్రజా రవాణా వ్యవస్థలను ఆశ్రయించడం ద్వారా ఇంధనాన్ని ఆదా చేశారని ప్రశంసించారు. ఈ సామూహిక కృషి అంతర్జాతీయ వేదికపై భారతదేశ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జూన్ మాసంలో రక్షణ రంగంలో దేశం సాధించిన విజయాలను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. అహ్మదాబాద్‌లో నిర్వహించిన వరల్డ్ యోగా ఆసనా ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు కనబరిచిన అద్భుత ప్రతిభను ఆయన అభినందించారు. ఈ పోటీలలో భారత్ 102 స్వర్ణాలతో పాటు మొత్తం 114 పతకాలు సాధించి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ద్వీప దేశాల అభివృద్ధికి భారత్ అందిస్తున్న తోడ్పాటుకు గుర్తింపుగా, సీషెల్స్‌లో ప్రధాని 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజన్' పురస్కారాన్ని అందుకున్న విషయం తెలిసిందే.

# భారీ వర్షాల ఎఫెక్ట్.. సీఎం రేవంత్ సభ రద్దు

మొదటిపేజీ తరువాయి – వర్షాల కారణంగా సభను హైదరాబాద్‌కు మార్చుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మధిర నియోజకవర్గంలో మంగళవారం నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభకు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. అయితే రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సభను రద్దు చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. సభను హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని 'రైతు భరోసా పంపిణీ సదస్సు'గా నిర్వహించనున్నారు. కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని మంత్రులు, ఉన్నతాధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులు ఇందులో పాల్గొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాల్లోని రైతు వేదికల ద్వారా డిజిటల్, వర్చువల్ విధానంలో సమావేశాన్ని ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం కల్పించనున్నారు.

## జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో పాల్గొన్న సీతక్క



మొదటిపేజీ తరువాయి – 100 శాతం వేతనాల విధానం కొనసాగించాలని, మెటీరియల్ కాంపోనెంట్‌కు 75 శాతం కేంద్ర వాటా ఉండాలని విజ్ఞప్తి చేశారు. పీఎం ఆవాస్ యోజన కింద గత బీఆర్ఎస్ ప్రభుత్వం వద్దనడంతో కేటాయింపులు లేవని... ఆ పథకం కింద తక్షణమే గృహాలు మంజూరు చేయాలని సీతక్క కోరారు. పీఎంజీఎస్‌వై రోడ్లకు అటవీ అనుమతులు ప్రధాన అడ్డంకిగా ఉన్నాయని, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. తెలంగాణలో జల్ సంచార్ విభాగంలో 13 జాతీయ అవార్డులు సాధించడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని సీతక్క పేర్కొన్నారు.

# ఇక్కడున్నది మోదీ-చంద్రబాబు-పవన్ అని గుర్తుంచుకోవాలి



మొదటిపేజీ తరువాయి – జనసేన అధినేత పవన్ కల్యాణ్ హుషారుతో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. 2024 ఎన్నికల్లో ప్రజలు కూటమికి చారిత్రక విజయాన్ని అందించారని, ప్రస్తుతం ఆ ప్రజాదరణ మరింత పెరిగిందని ఆయన పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమిదే ఘనవిజయమని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పల్లెలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, కనీస సౌకర్యాల కల్పనకు కూడా నిధులు లేని దుస్థితి నెలకొందని విమర్శించారు. గత ఐదేళ్లలో కేవలం 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు మాత్రమే నిర్మిస్తే, తమ ప్రభుత్వం కేవలం రెండేళ్ల వ్యవధిలోనే 6,500 కిలోమీటర్ల రోడ్లను నిర్మించిందని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంపై రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం, ఖాళీ ఖజానా ఉన్నప్పటికీ, 'సూపర్ సిక్స్' వంటి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు రెండో దశను పూర్తి చేసి ఉదయగిరి నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.

# ఖమేనీ అంత్యక్రియలకు మోదీ దూరం



మొదటిపేజీ తరువాయి – సహాయ మంత్రి పవిత్ర మార్గెరిటా భారత ప్రతినిధులుగా పాల్గొననున్నారు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ ఇటీవల ప్రధాని మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపారు. అయితే ఆ సమయంలో ఇండోనేషియా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా పర్యటన ఇప్పటికే ఖరారు కావడంతో మోదీ హాజరు కాలేకపోతున్నారు. ఈ షెడ్యూల్ ముందుగానే ఖరారైందని అధికార వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడిలో ఖమేనీ మరణించారు. తొలుత మార్చిలో అంత్యక్రియలు నిర్వహించాలని భావించారు. కానీ ప్రాంతీయ ఉద్రిక్తతల కారణంగా వాటిని వాయిదా వేశారు. ఇప్పుడు జులైలో పలువురు దేశాధినేతలు, ప్రతినిధుల సమక్షంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జులై 4న టెహ్రాన్‌లోని గ్రాండ్ మొసల్లా సముదాయంలో ఖమేనీ భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. చివరి అంత్యక్రియలు జులై 9న ఖమేనీ స్వస్థలమైన మష్హద్‌లోని ఇమామ్ రెజా దర్గా వద్ద జరగనున్నాయి.

# రాముడు-శివుడిపై సీఎం రేవంత్ రెడ్డి కామెంట్స్

మొదటిపేజీ తరువాయి – ఉత్తర, దక్షిణ భారతదేశ ప్రజల మధ్య మత, రాజకీయ పరమైన గుర్తింపులపై ఆయన చేసిన విశ్లేషణ పెద్ద వివాదానికి దారితీసింది. రాజకీయ లబ్ధి కోసం రేవంత్ రెడ్డి సమాజంలో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ తీవ్రంగా విమర్శించింది.

**ఏం జరిగిందంటే..!**

జాతీయ రాజధాని ఢిల్లీలో జరిగిన ఒక మీడియా కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి, బీజేపీ నినాదాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ సహా బీజేపీ నేతలు పదే పదే 'జై శ్రీరామ్' అని ఎందుకు అంటారని, అదే తరహాలో 'హర హర మహాదేవ్' అని ఎందుకు నినదించరని ఆయన ప్రశ్నించారు. "మేం ద్రావిడులం. ఇక్కడి (ఉత్తర భారతదేశం) ప్రజలు ఆర్యులు. మేం శివ భక్తులం, ఇక్కడి ప్రజలు శ్రీరాముడి భక్తులు. బీజేపీ రాముడిని దొంగిలించింది. అది ఒక భావోద్వేగం. మోదీ గారు 'హర హర మహాదేవ్' అని ఎందుకు అనరు? బీజేపీ నేతలు వేదికపై ఆ నినాదం చేయడం మీరు ఎప్పుడైనా చూశారా? వాళ్లు కేవలం 'జై శ్రీరామ్' అంటారు. మేం 'హర హర మహాదేవ్' అంటే వారికి నచ్చదు" అని రేవంత్ రెడ్డి అన్నారు. శివుడిని 'పేదల దేవుడు' అని, రాముడిని 'ధనవంతుల దేవుడు' అని అభివర్ణించిన ఆయన, ఇద్దరు దేవుళ్లను ప్రజలు ఆరాధిస్తారని కూడా స్పష్టం చేశారు. ఉత్తర, దక్షిణ భారతదేశ రాజకీయ సంస్కృతులు, సామాజిక గుర్తింపుల మధ్య విస్తృతమైన తేడాలు ఉన్నాయనే వాదనకు బలం చేకూర్చే క్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**తీవ్రంగా స్పందించిన బీజేపీ**

రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆదేశాల మేరకే రేవంత్ రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించింది. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ మాట్లాడుతూ.. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే హిందువులను విభజించేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. "రాహుల్ గాంధీ సూచనల మేరకు, హిందువులను విభజించడానికి కొత్త మార్గం కనుగొనే ప్రయత్నంలో భాగంగానే రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు" అని ప్రదీప్ భండారీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ పార్టీని 'ఆధునిక ముస్లిం లీగ్ కాంగ్రెస్' అని అభివర్ణించిన ఆయన, రాముడు, శివుడి అనుచరుల మధ్య చిచ్చు పెట్టే కుట్రలు ఫలించవని హెచ్చరించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అనేక మతపరమైన, ఆలయ సంబంధిత కార్యక్రమాలను వ్యతిరేకించిందని ఆయన గుర్తుచేశారు. "సోమనాథ్ ఆలయ నిర్మాణాన్ని, కాశీ విశ్వనాథ్ ధామ్ కారిడార్‌ను కాంగ్రెస్ వ్యతిరేకించిన విషయం దేశం మరిచిపోలేదు. 2018లో 'హర హర మహాదేవ్' అని నినదించినందుకు ముగ్గురు పార్టీ కార్యకర్తలను సస్పెండ్ చేసింది" అని భండారీ ఆరోపించారు. బీజేపీ నేతలు 'హర హర మహాదేవ్' అని నినదించరన్న రేవంత్ వాదనను ఆయన తోసిపుచ్చారు. "ప్రధాని మోదీ 'జై శ్రీరామ్'తో పాటు 'హర హర మహాదేవ్' అని కూడా నినదించే ఏకైక ప్రధానమంత్రి. లంకకు వెళ్లే ముందు శ్రీరాముడు స్వయంగా మహాదేవుడికి పూజలు చేశాడని రామాయణంలోని లంకాకాండలో ఉంది. ఓటు బ్యాంకు రాజకీయాలు చేసేవారికి ఈ విషయం కూడా తెలియదు" అని ఆయన ఎద్దేవా చేశారు. మొత్తంగా రేవంత్ వ్యాఖ్యలు బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధానికి దారితీశాయి.

# దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

మొదటిపేజీ తరువాయి – శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి వ్యక్తికి తమ తమ దేవతలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల నమ్మకాలను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు ఆంజనేయ స్వామి సహా అన్ని ఆలయాల పట్ల తనకు గౌరవం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగతంగా తనకు శివుడు ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.

# బుల్లెట్ ట్రైన్ పేరుతో రియల్ ఎస్టేట్ దందా



మొదటిపేజీ తరువాయి – ఎస్టేట్ కుంభకోణానికి పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తమ పార్టీ అభివృద్ధికి గానీ, బుల్లెట్ ట్రైన్‌కు గానీ వ్యతిరేకం కాదని, కానీ దాని ముసుగులో రైతుల భూములను లాక్కోవాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. శంషాబాద్ విమానాశ్రయం వద్ద వేల ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండగా, తరతరాలుగా రైతులు సాగు చేసుకుంటున్న బహదూర్‌పల్లి వ్యవసాయ భూములను ఎందుకు సేకరిస్తున్నారని కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒక రైల్వే స్టేషన్ కోసం వెయ్యి ఎకరాలు అవసరమా? అని నిలదీశారు. రైతుల భూములపై సుమారు 4,000 మంది పోలీసులను మోహరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. "ప్రభుత్వం వద్ద సరైన పత్రాలు ఉంటే వాటిని రైతులకు చూపించాలి, అంతేకానీ పోలీసులను పెట్టి భయపెట్టడం ఎందుకు?" అని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. "ఏడాదిన్నరలో మీ ఆశీస్సులతో కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తారు. మీ పట్టాలు మీకే ఇప్పిస్తాం. మీకోసం హైకోర్టుకు వెళ్లిన కార్తీక్ రెడ్డి ద్వారానే మీకు పట్టాలు అందేలా చూస్తాం," అని రైతులకు కేటీఆర్ భరోసా ఇచ్చారు. రైతులు అధైర్యపడొద్దని, ఐక్యంగా ఉండాలని సూచించారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా, న్యాయపరంగా అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

# మొరంపల్లి బంజరలో ఐటిసి ఆధ్వర్యంలో ఘనంగా గర్భిణీలకు పండ్ల పంపిణీ సర్పంచ్ బొర్రా సుభద్ర సిడిపిఓ



**బూర్గంపాడు సెప్టెంబర్ 30 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** మొరంపల్లి బంజర గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పోషణ మాసం ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో. సర్పంచ్ బొర్రా సుభద్ర మాట్లాడుతూ.గర్భిణీ స్త్రీలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లి బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు వైద్యుల సూచనలు పాటిస్తూ ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని, గర్భిణీలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు మండలంలోని అంగన్వాడీ టీచర్లు, అంగన్వాడీ సూపర్ వైజర్లు, ఐ టి సి అధికారులు అంగన్వాడీ సిబ్బంది, , మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# తాగి బండి నడిపితే జైలే వాహనదారులకు ఎస్సై మేడ ప్రసాద్ స్ట్రాంగ్ వార్నింగ్



**బూర్గంపాడు సెప్టెంబర్ 30 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని ప్రధాన అంబేద్కర్ కూడలిలో ఎస్ఐ మేడ ప్రసాద్ ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వాహనదారులు తప్పనిసరిగా వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడిపితే వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, జైలు శిక్షలు కూడా ఉంటాయి అని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అట్రాసిటీ బాధితులకు సత్వర న్యాయం అందించాలి

కలెక్టర్ హరిత....



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 30: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం జిల్లాలో అట్రాసిటీ బాధితులకు సత్వర న్యాయంతో పాటు పరిహారం అందిస్తామని కలెక్టర్ కె. హరిత చెప్పారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ నితికా పంత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరితో కలిసి జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో అట్రాసిటీ కేసులపై సమీక్షించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లాలో 39 అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. ఈ కేసులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, బాధితులకు త్వరగా న్యాయం చేస్తామని కలెక్టర్ చెప్పారు. పరిహారం మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డీఎస్పీలు అశోక్, వహిదుద్దీన్, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అధికారి అశోక్, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సిడాం అర్జు, గోపాల్, అశోక్, కేశవరావు, గణేష్, గంగుబాయి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

# రహదారి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ హరిత....



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 30: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం జిల్లాలో రహదారి ప్రమాదాలు జరగకుండా ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ నితికా పంత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావుతో కలిసి రహదారి భద్రత, ప్రమాదాల నివారణపై అధికారులతో సమీక్షించారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. రహదారులపై పశువులు తిరగకుండా వాటి యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రధాన రహదారులు, మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో పశువులు, కుక్కలు వాహనాలకు అడ్డం వచ్చి ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ అంశంపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. రహదారులు భవనాలు, పంచాయతీరాజ్ రోడ్లపై గుంతలను వెంటనే మరమ్మతు చేయాలని, కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆటో, ఇతర వాహన డ్రైవర్లు మద్యం తాగి నడపకుండా, ప్రతి వాహనదారుడు హెల్మెట్ లేదా సీట్ బెల్ట్ ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మైనర్లు వాహనాలు నడపకుండా తనిఖీలు చేయాలని, మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించేందుకు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# కల్తీ ఆహారంపై కఠిన చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ హరిత.....



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 30: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం జిల్లాలోని హోటళ్లు, బేకరీలు, గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో కల్తీ వస్తువులతో ఆహారం తయారు చేసేవారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. ఆహార భద్రత అధికారులు హోటళ్లు, బేకరీలు, తినుబండారాల దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేయాలని, వ్యాపార అనుమతులు, రిజిస్ట్రేషన్లను పరిశీలించాలని సూచించారు. సంక్షేమ, రెసిడెన్షియల్ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో వాడే ముడి సరుకుల నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఆహారం ద్వారా వ్యాపించే వ్యాధులు, విష ఆహార ఘటనలు జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. తనిఖీల్లో పట్టుబడిన వస్తువులు, సంబంధిత వ్యాపార సంస్థల వివరాలు పత్రికల్లో వచ్చేలా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, ఫుడ్ సేఫ్టీ డెసిగ్నేటెడ్ అధికారి వాసు రావు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, వైద్యులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు

# నెల్లిపాక పోస్టాఫీసు బాధితులకు న్యాయం చేయాలి ఖమ్మం పోస్టల్ సూపరింటెండెంట్‌కు సర్పంచ్ వినతి!

రెండేళ్ల క్రితం నిధుల దుర్వినియోగం.. ఇంకా జమకాని ఖాతాదారుల నగదు

రశీదులు ఇచ్చినా ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లిన సర్పంచ్ ముండ్రు వెంకట్రామకృష్ణ



**భద్రాద్రి కొత్తగూడెం,పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి-వల్లెపోగు రాము)అశ్వాపురం, సెప్టెంబర్ 30 :-** నెల్లిపాక బ్రాంచ్ పోస్టాఫీసులో నిధుల దుర్వినియోగం కారణంగా నష్టపోయిన పేద ఖాతాదారులకు తక్షణమే వారి సొమ్మును అందజేసి ఆదుకోవాలని నెల్లిపాక గ్రామపంచాయతీ సర్పంచ్ ముండ్రు వెంకట్రామకృష్ణ కోరారు. బుధవారం ఖమ్మం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్స్ కార్యాలయంలో జిల్లా పోస్టల్ ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యపై సమగ్ర వినతిపత్రం అందజేశారు. ?గతంలో జరిగిన గోల్‌మాల్ వ్యవహారాన్ని, బాధితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సర్పంచ్ అధికారులకు వివరించారు. 2024వ సంవత్సరంలో నెల్లిపాక బ్రాంచ్ పోస్టాఫీసు పరిధిలోని పలువురు ఖాతాదారుల డిపాజిట్ సొమ్మును అప్పటి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ స్వాహా చేసినట్లు గుర్తించారు. ఈ అక్రమాలపై అప్పట్లోనే ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్స్ సమగ్ర విచారణ నిర్వహించి, ఏ ఖాతాదారుడికి ఎంత మొత్తం రావాలో లెక్క తేల్చి అధికారికంగా రశీదులు కూడా అందజేశారు. త్వరలోనే ఖాతాల్లో సొమ్ము జమ అవుతుందని హామీ ఇచ్చారు. అయితే విచారణ పూర్తయి రెండేళ్లు గడిచి, మూడో ఏడాది వస్తున్నా ఇంతవరకు ఖాతాదారుల ఖాతాల్లో నయాపైసా జమ కాలేదని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు.సర్పంచ్ ఇచ్చిన వినతిపత్రంపై ఖమ్మం పోస్టల్ ఎస్పీ సానుకూలంగా స్పందించారు. ఈ వ్యవహారంపై తక్షణమే ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, విచారణ నివేదిక ఆధారంగా బాధితులైన ఖాతాదారుల బ్యాంకు ఖాతాల్లో త్వరలోనే సొమ్మును జమచేసేలా చర్యలు చేపడతామని స్పష్టమైన హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారానికి సానుకూలంగా స్పందించినందుకు గాను పోస్టల్ ఎస్పీకి గ్రామస్తుల తరపున సర్పంచ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ?ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొర్రెముచ్చు వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ గొర్రెముచ్చు వెంకటరమణ, గజ్జల నాగరాజు మరియు బాధితులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులు స్మార్ట్ రేషన్ కార్డు లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే పాయం

**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి) అశ్వాపురం సెప్టెంబర్ 30:-** అశ్వాపురంలో రైతు వేదిక నందు తహసిల్దార్ సూర్యప్రకాష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన చెక్కులు,స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని.. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 23 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 1లక్ష 116/- రూపాయలు చొప్పున చెక్కులు, అదేవిధంగా మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన... ఎమ్మెల్యేపాయం వెంకటేశ్వర్లు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. అదేవిధంగా ఆడపిల్లల వివాహ సమయంలో పేద కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు తెలంగాణ



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలు ఎంతో తోడ్పాటుగా నిలుస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమ కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. పౌరసరఫరాల శాఖ మరియు వినియోగదారుల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో "స్మార్ట్ రేషన్



కార్డుల" ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత సులభతరం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,సర్పంచులు, ఉపసర్పంచులు,వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు,స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఫరీద్‌పేట దాడులపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆగ్రహంబిపోలీసుల తీరుపై తీవ్ర మండిపాటు సాయంత్రం 7 గంటలలోపు నిందితులను అదుపులోకి తీసుకోవాలని అల్టిమేటం.ఫిర్యాదు చేసి 24 గంటలు గడుస్తున్నా పట్టించుకోని వైనం



**కామారెడ్డి జిల్లా ప్రతినిది సెప్టెంబర్ 30.(పోరు తెలంగాణ న్యూస్) :** కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఫరీద్‌పేట గ్రామంలో బెల్ట్ షాపుల టెండర్ల వివాదం, మహిళా వార్డు సభ్యులు మరియు సామాజిక కార్యకర్త మధుసూధన్ పై జరిగిన దాడుల ఉదంతంపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తీవ్రంగా స్పందించారు. దాడి జరిగి 24 గంటలు గడుస్తున్నా పోలీసులు ఇప్పటివరకు కేసులు నమోదు చేయకపోవడం పట్ల ఆయన మండిపడ్డారు. మధుసూధన్ కి స్వయంగా ఫోన్ చేసి మాట్లాడి, వివరాలు ఆరా తీశారు. ప్రజాప్రతినిధులపై, సామాజిక కార్యకర్తలపై రౌడీ మూకలు దాడి చేస్తుంటే పోలీసులు చోద్యం చూస్తున్నారా అని పోలీసు శాఖను ఆయన నిలదీశారు. ఈరోజు సాయంత్రం 7 గంటల లోపు మహిళా వార్డు సభ్యులను, మధుసూధన్ ని దూషించి దాడులకు పాల్పడిన నిందితులపై కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకోవాలని, లేనిపక్షంలో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన పోలీసు శాఖను తీవ్రంగా హెచ్చరించారు.

# ఓదెల సబ్ స్టేషన్ వద్ద రైతుల ధర్నా



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపల్లి జిల్లా సెప్టెంబర్ 30 లో వోల్టేజ్ సమస్యల తో ఇబ్బందులను ఎదుర్కొంటున్న రైతులు గత నెల రోజుల నుండి విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు సమస్య తెలియజేసిన విద్యుత్ అధికారులు ఇప్పుడు అప్పుడు అంటూ దాటవేసే ధోరణితో ఉంటున్నారని రైతులు మండిపడుతున్నారు బుధవారం రైతులందరూ కలిసి ఓదెల సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 20 మోటార్లు నడిచే సామర్థ్యం కలిగిఉన్న ట్రాన్స్ఫార్మర్ కు 48 మోటార్లు నడుస్తున్నాయని రైతులు వాపోయారు అధిక విద్యుత్తు లోడుతో ఫీజు కొట్టేస్తూ తరచూ విద్యుత్ సమస్య ఉండడంతో పొలాలు ఎండిపోతున్నాయని రైతులు విద్యుత్తు అధికారులపై మండిపడ్డారు. వెంటనే స్పందించిన ఏ ఈ పది రోజులలో సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో రైతులు ధర్నా విరమించారు ఈ కార్యక్రమంలో బుద్దె రవి, నోముల ఇంద్రారెడ్డి, పేరవేణి హరీష్, ఆసరా కుమార్, గటిక రాజమల్లు, బోడకుంట నరేందర్, రాపల్లి బాపూరావు, నోముల దేవేందర్ పాల్గొన్నారు.

# గోదావరి జలాలు తూముల లాకులు తీసి పంట పొలాలకు నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**కొత్తగూడెం సెప్టెంబర్ 30 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** కొత్తగూడెం జిల్లాలో అశ్వాపురం మండలం మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా గోదావరి జలాలను తుమ్మల చెరువు ఆయకట్టుకు తరలించి, అక్కడి నుంచి తూముల ద్వారా పంట పొలాలకు సాగునీటిని విడుదల చేసే కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్వయంగా తూముల లాకులు తీసి గోదావరి జలాలను పంట పొలాలకు విడుదల చేశారు. మారెళ్ళపాడు లిఫ్ట్ ద్వారా గోదావరి నీటిని తుమ్మల చెరువులోకి ఎత్తిపోసి, అక్కడి నుంచి తూముల ద్వారా ఆయకట్టు పరిధిలోని పంట పొలాలకు సాగునీరు అందేలా నీటి విడుదల ప్రక్రియను ఎమ్మెల్యే పరిశీలించారు. గోదావరి జలాలు తుమ్మల చెరువు ఆయకట్టుకు



చేరడంతో సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఎంతో ప్రయోజనం కలగనుంది. మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా గోదావరి జలాలను ఆయకట్టు ప్రాంతాలకు అందుబాటులోకి తీసుకురావడం వల్ల పంటల సాగుకు మరింత భరోసా కలుగుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా నీటి విడుదలకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు, సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. తూముల ద్వారా ఆయకట్టు పరిధిలోని పంట పొలాలకు నీరు సక్రమంగా చేరేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. మారెళ్ళపాడు లిఫ్ట్ ద్వారా గోదావరి జలాలు తుమ్మల చెరువు ఆయకట్టుకు చేరి, తూముల లాకులు తెరిచి పంట పొలాలకు నీటిని విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# డిజిటల్ లెర్నింగ్‌తో గణిత బోధన మరింత ప్రతిభావంతం

అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్....

**పోరు తెలంగాణ సెప్టెంబర్ 30: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం ఆధునిక సాంకేతికతను గణిత బోధనలో విస్తృతంగా వినియోగించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో గణిత ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న డిజిటల్ లెర్నింగ్ శిక్షణ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారితో కలిసి హాజరయ్యారు. డిజిటల్ విధానంతో విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి పెరుగుతుందని, తార్కిక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలు మెరుగవుతాయని చెప్పారు. సంప్రదాయ బోధనతో పాటు సాంకేతిక వనరులను వాడితే క్లిష్టమైన గణిత భావనలను విద్యార్థులకు సులభంగా, దృశ్య రూపంలో అర్థమయ్యేలా బోధించవచ్చన్నారు. సాంకేతికతను ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాన్ని పెంచే సాధనంగా చూడాలని పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను తరగతి గదుల్లో అమలు చేసి, ప్రతి విద్యార్థికి నాణ్యమైన గణిత విద్యను అందించాలని ఆదేశించారు. విద్యార్థుల స్థాయికి తగినట్లు డిజిటల్ వనరులు వాడుతూ, చేయడం ద్వారా నేర్చుకునే విధానాలను ప్రోత్సహించాలని, కనీస అభ్యాస సామర్థ్యాల సాధన, గణిత ఫలితాల మెరుగుదలకు



ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. నిరంతర వృత్తిపరమైన శిక్షణ విద్యా ప్రమాణాలను పెంచుతుందని వివరించారు.

# ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ ఎన్నికల్లో రామకృష్ణ ప్యానెల్ ఘన విజయం

అధ్యక్షుడిగా మైలవరం రామకృష్ణ.. ప్రధాన కార్యదర్శిగా జల్లపెల్లి నాగరాజు

కోశాధికారిగా పామర్తి శోభన్‌బాబు ఎన్నిక

687 ఓట్లు పోలింగ్.. 49 ఓట్ల మెజారిటీతో ప్యానెల్ విజయం



**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, సెప్టెంబర్ 30(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఎన్నికలు బుధవారం స్థానిక పెద్దమ్మతల్లి దేవాలయ సన్నిధిలోని శ్రీ శాంభవి ఫంక్షన్ హాల్‌లో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. తెలంగాణ రాష్ట్ర ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో మైలవరం రామకృష్ణ అధ్యక్షుడిగా, జల్లపెల్లి నాగరాజు ప్రధాన కార్యదర్శిగా, పామర్తి శోభన్‌బాబు కోశాధికారిగా ఎన్నికయ్యారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 834 ఓట్లకు గాను 687 ఓట్లు పోలయ్యాయి. జరిగిన ఓట్ల లెక్కింపులో రామకృష్ణ ప్యానెల్ 49 ఓట్ల మెజారిటీతో విజయం సాధించింది. దీంతో ఫోటో, వీడియోగ్రఫీ రంగానికి చెందిన సభ్యులు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఎన్నిక అనంతరం నూతన అధ్యక్షుడు మైలవరం రామకృష్ణ మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 17 మండలాలకు చెందిన ఫోటో, వీడియోగ్రాఫర్లకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, వృత్తిలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేలా వర్క్‌షాప్‌లు నిర్వహించి ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల వృత్తి నైపుణ్యాన్ని మరింత పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అసోసియేషన్ సభ్యుల సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధి, ఐక్యత కోసం నూతన కార్యవర్గం సమష్టిగా పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఈ ఎన్నికల కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులతో పాటు జిల్లా పరిధిలోని 17 మండలాలకు చెందిన ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తుమ్మల చెరువు అభివృద్ధికి మరో ముందడుగు...!!

రోడ్డు, హైలెవల్ బ్రిడ్జి మంజూరు చేయాలని ఎమ్మెల్యే పాయంకు వినతి పత్రం ఇచ్చిన.. సర్పంచ్ నరసింహారావు.

**భద్రాద్రి కొత్తగూడెం,పోరు తెలంగాణ- పినపాక నియోజకవర్గం ప్రతినిధి-వల్లెపోగు రాము అశ్వాపురం సెప్టెంబర్ 30 :-** కాకతీయుల కాలం నుంచి ప్రసిద్ధి చెందిన తుమ్మల చెరువు కింద సుమారు 10 వేల ఎకరాల ఆయకట్టు ఉందని, ఈ ప్రాంత రైతుల చిరకాల సాగునీటి కలను సాకారం చేస్తూ ప్రజా ప్రభుత్వం మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా తుమ్మల చెరువుకు గోదావరి జలాలను అందించడం ఎంతో సంతోషకరమైన విషయమని మల్లెల మడుగు గ్రామ సర్పంచ్ మచ్చ నరసింహారావు తెలిపారు. తుమ్మల చెరువుకు సాగునీరు అందుతున్న నేపథ్యంలో రైతులకు, గ్రామీణ ప్రజలకు మరింత ప్రయోజనం కలిగేలా తుమ్మల చెరువు గ్రామానికి వెళ్లే రోడ్డు నుంచి తుమ్మల చెరువు కట్ట వరకు రోడ్డు మంజూరు చేయాలని, అలాగే అలుగు తూము వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం మంజూరు చేయాలని కోరుతూ పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మచ్చ నరసింహారావు మాట్లాడుతూ.. తుమ్మల చెరువు కట్టపైకి సరైన రోడ్డు సౌకర్యం లేక రైతులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తుమ్మల చెరువు గ్రామ రోడ్డు నుంచి చెరువు కట్ట వరకు రోడ్డు నిర్మాణం చేపడితే రైతులు తమ వ్యవసాయ పనులకు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా అలుగు తూము వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం ద్వారా వర్షాకాలంలో నీటి ప్రవాహం కారణంగా ఏర్పడే రాకపోకల ఇబ్బందులు తొలగుతాయని, ప్రజలకు ఏడాది పొడవునా మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా తుమ్మల చెరువుకు గోదావరి జలాలను అందించి రైతుల చిరకాల స్వప్నాన్ని సాకారం చేసిన ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా తుమ్మల చెరువు కట్టకు రోడ్డు, అలుగు తూము వద్ద హైలెవల్ బ్రిడ్జి మంజూరు చేయించి రైతులు, ప్రజలకు మరింత మేలు చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని కోరారు.



వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమస్యలను పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బేతం రామకృష్ణ, ఆవుల రవి, బచ్చు వెంకటరమణ, చెంచల రాము, పాటి ప్రదీప్ రెడ్డి, బారాస్ సంపత్, గొడ్ల నాగేశ్వరరావు, అణువుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగం,విద్యా వ్యవస్థ ప్రక్షాళన కోసం జెన్ జి పోరాటం స్ఫూర్తిదాయకం

డిల్లీ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి.

ఉద్యమంపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు.

ప్రసంగిస్తున్న మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రేపాకుల శ్రీనివాస్.

**భద్రాచలం సెప్టెంబర్ 30 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల ఉద్యమం స్ఫూర్తిదాయకమని, విద్యార్థులు ఇటువంటి ఉద్యమాలను ఆదర్శంగా తీసుకొని ప్రశ్నించే తత్వాన్ని, పోరాడే స్ఫూర్తిని అలవర్చుకోవాలని పూర్వ ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రేపాకుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు.బుధవారం నాడు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన జెడ్ అవగాహన సదస్సులో ముఖ్య వక్తలుగా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు రేపాకుల శ్రీనివాస్,మథర్ థెరిస్సా డిగ్రీ కళాశాల డైరెక్టర్ తోటమల్ల రమణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ భద్రాచలం పట్టణ కార్యదర్శి కొప్పుల రవీందర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో లో వారు మాట్లాడుతూ, నేటి తరం విద్యార్థులు సమాజంలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలించాలని అన్నారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా సమాజంలోని సమస్యలపై అవగాహన



పెంచుకోవాలని, తమ హక్కులకు భంగం కలిగినప్పుడు ప్రశ్నించే ధైర్యాన్ని కలిగి ఉండాలని సూచించారు. జెడ్ తరం సోషల్ మీడియాను విస్తృతంగా ఉపయోగిస్తున్నప్పటికీ, సామాజిక సమస్యలపై ప్రత్యక్షంగా స్పందించడం, ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ గొంతును వినిపించడం కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. విద్య, ఉపాధి, ఫీజులు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు వంటి విద్యార్థుల సమస్యలపై ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.విద్యార్థి ఉద్యమాలు సమాజంలో మార్పుకు దోహదపడతాయని, చరిత్రలో అనేక సందర్భాల్లో విద్యార్థులు ప్రజా సమస్యలపై ముందుండి పోరాటాలు నిర్వహించారని పేర్కొన్నారు. అన్యాయం జరిగినప్పుడు మౌనంగా ఉండకుండా ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రశ్నించడం




విద్యార్థుల బాధ్యత అని అన్నారు.ప్రస్తుత జెడతరం అంతర్జాల పోరాటం తో పాటు బహిరంగ పోరాటాలకు కూడా నాయకత్వం వహించిందన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సమాచారాన్ని నమ్మకుండా వాస్తవాలను తెలుసుకోవాలని, శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని సూచించారు.విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తుందని, విద్యార్థుల హక్కుల కోసం జరిగే పోరాటాల్లో యువత పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో లక్ష్మి, నికిత,పద్మ, అంజలి, రాణి,లక్ష్మి ప్రసన్న, సాహుల్, ప్రశాంత్, కిషోర్, నారాయణ,తదితరులు పాల్గొన్నారు.

# బాల రక్షక భవన్ ఘటనపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు ఎమ్మార్పీఎస్ నాయకుల వినతి



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 30: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం బాల రక్షక భవన్‌లో మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని, మాదిగ సమాజాన్ని కించపరిచిన గాదవేని మల్లేష్‌పై చర్యలు చేపట్టాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ముఖద్వారం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. బాల రక్షక భవన్‌లో పనిచేస్తున్న మహేష్ అనే వ్యక్తి అక్కడి మహిళలతో అసభ్యంగా ప్రవర్తించినట్లు పత్రికా కథనాల ద్వారా తెలిసిందని నాయకులు వెల్లడించారు. దీనిపై అధికారులను అడగగా, ఘటన తప్పేనని అంగీకరించారని, సదరు వ్యక్తి క్షమాపణ చెప్పాడని చెప్పారు. మహిళల గౌరవం, భద్రతకు సంబంధించిన అంశాన్ని తేలికగా తీసుకోరాదని, అతడిని విధుల నుంచి తొలగించి, మహిళల రక్షణ చట్టాల ప్రకారం విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాదిగ సమాజాన్ని కించపరిచేలా గాదవేని మల్లేష్ మాట్లాడిన విషయాన్ని పద్మశ్రీ డాక్టర్ మందకృష్ణ మాదిగ దృష్టికి తీసుకెళ్లినట్లు నాయకులు వివరించారు. తమ సమక్షంలో క్షమాపణ చెబుతానని చెప్పిన మల్లేష్ నెలన్నర గడిచినా స్పందించలేదన్నారు. వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, లేకపోతే పోలీసు అధికారులు అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# గిరిజన పాఠశాలలకు డిజిటల్ బోధన పరికరాలు

ప్రొజెక్టర్లు, క్రీడా సామగ్రి పంపిణీ.....

సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన.....

**పోరు తెలంగాణ సెప్టెంబర్ 30: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని మొవాడ్‌దగడ్ గిరిజన పాఠశాలలో బుధవారం కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో డిజిటల్ విద్యను మరింత విస్తరించే ఉద్దేశంతో ప్రొజెక్టర్లను ఉపాధ్యాయులకు అందజేశారు. అలాగే విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు క్రీడా సామగ్రితో పాటు అవసరమైన ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఏసీఎంఓ ఉద్ధవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డివిజన్ ఏడీఈఓ, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్, ఎస్ఆర్‌పీ, సిర్పూర్-టి ఎంఈఓలు ఉపాధ్యాయులకు సామగ్రిని




అందించారు. ప్రొజెక్టర్లను పాఠ్యాంశాలకు అనుసంధానం చేసి వినియోగించడం ద్వారా విద్యార్థులకు దృశ్య, శ్రవణ ఆధారిత బోధన అందించవచ్చని సూచించారు. ప్రస్తుత విద్యా విధానంలో డిజిటల్ పరికరాలు తరగతి గది బోధనకు తోడ్పడే సాధనాలుగా ఉపయోగపడుతున్నాయి. తెలంగాణలోని గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లోనూ కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, డిజిటల్ ఇంటరాక్టివ్ బోర్డుల వంటి సౌకర్యాల




అభివృద్ధికి చర్యలు కొనసాగుతున్నాయి. విద్యార్థులలో పాఠ్యాంశాలపై ఆసక్తిని పెంచడంతో పాటు క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు అందించిన సామగ్రిని సక్రమంగా వినియోగించాలని అధికారులు సూచించారు. పాఠశాలల్లో అందుబాటులోకి వచ్చిన పరికరాలను కేవలం భద్రపరచకుండా తరగతి బోధనలో నిరంతరం ఉపయోగించేలా ఉపాధ్యాయులు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు.



# పాఠశాలల్లో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

**పోరు తెలంగాణ సెప్టెంబర్ 30: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కాగజ్‌నగర్ మండలం జిల్లా ఎస్పీ నితికా పంత్, డీఎస్పీ వహీ ఉద్దీన్, కాగజ్‌నగర్ టౌన్ ఎస్‌హెచ్‌ఓ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ యాదగిరి వివిధ పాఠశాలల్లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింక్‌లపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఓటీపీ, ఏటీఎం పిన్, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ చెప్పవద్దని, సామాజిక మాధ్యమాలను జాగ్రత్తగా వాడాలని చెప్పారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ యాదగిరి తెలిపారు. విద్యార్థులు అవగాహన పెంచుకోవడంతో పాటు తమ కుటుంబ సభ్యులకు కూడా వివరించాలని కోరార

# సింగరేణి బాగుపడాలంటే రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాలి

ఎమ్మెల్యే హరీష్ బాబు....



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 30: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** మంచిర్యాల జిల్లా నస్పూర్ నస్పూర్ సీసీసీ కార్నర్ వద్ద "సింగరేణి బకాయి బీజేపీ లడాయి" ఉద్యమం జరిగింది. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిని దివాలా తీయిస్తోందని సిర్పూర్ శాసనసభ్యులు హరీష్ బాబు ఆరోపించారు. కోల్ ఇండియా లాగా సింగరేణి అభివృద్ధి చెందాలంటే రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని స్పష్టం చేశారు. 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం అబద్ధం చెబుతోందని, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు కూడా బొగ్గు సరఫరా చేయలేని స్థితిలో సంస్థ ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.55 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ బకాయిల పాపంలో సగం వాటా గత కేసీఆర్ ప్రభుత్వానిదని ఆరోపించారు. సింగరేణి కార్మికులకు, ఆ ప్రాంత ప్రజలకు బీజేపీ అండగా ఉంటుందని, ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# ఆసిఫాబాద్‌లో జిల్లా స్థాయి సబ్-జూనియర్ అథ్లెటిక్స్ ఎంపికలు పూర్తి





**పోరు తెలంగాణ సెప్టెంబర్ 30: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్‌లోని గిరిజన సంక్షేమ మోడల్ క్రీడా పాఠశాలలో బుధవారం జిల్లా స్థాయి సబ్-జూనియర్ అథ్లెటిక్స్ ఎంపికలు జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి సుమారు 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన 40 మందిని ఎంపిక చేసి, అక్టోబర్ 11న ఆసిఫాబాద్‌లోనే జరిగే రాష్ట్ర స్థాయి సబ్-జూనియర్ ఛాంపియన్‌షిప్‌కు జిల్లా జట్టుగా పంపనున్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గుండం లక్ష్మణ్ ఈ విషయం స్పష్టం చేశారు.గిరిజన సంక్షేమ శాఖ జిల్లా ఉప సంచాలకుడు జాదవ్ అంబాజీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్రే అనిల్ హాజరై క్రీడాకారులను అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల నేపథ్యంలో జిల్లా జట్టును పటిష్టంగా తీర్చిదిద్దాలని జాదవ్ అంబాజీ కోరారు. పోటీల నిర్వహణకు కమిటీ వేసి, బాధ్యతలు పంచుకోవాలని సూచించారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు ప్రత్యేక చొరవ తీసుకుని క్రీడా మైదానానికి మరమ్మతులు చేయిస్తున్నారు.

# పాల్వంచలో 12 అడుగుల కొండచిలువ కలకలం

శ్రీనివాస్ నగర్ కాలనీ గుట్ట సమీపంలో ప్రత్యక్షం స్నేక్ రెస్క్యూ టీమ్ చాకచక్యంగా పట్టివేత



**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, సెప్టెంబర్ 30(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కాలనీ గుట్ట సమీపంలో సుమారు 12 అడుగుల పొడవైన భారీ కొండచిలువ ప్రత్యక్షమవడంతో స్థానికంగా కలకలం రేగింది. కాలనీ సమీపంలో కొండచిలువను గుర్తించిన స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ అధికారుల సమాచారంతో కొత్తగూడెం స్నేక్ రెస్క్యూ టీమ్ అక్కడికి చేరుకుని చాకచక్యంగా కొండచిలువను పట్టుకుంది. దీంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. భారీ కొండచిలువను చూసేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. పట్టుకున్న కొండచిలువను అటవీ శాఖ అధికారుల సమక్షంలో సురక్షితంగా అటవీ ప్రాంతంలో విడిచిపెడతామని అధికారులు తెలిపారు. కాలనీ పరిసరాల్లో ఇలాంటి వన్యప్రాణులు కనిపించినప్పుడు ప్రజలు భయపడకుండా వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

# మటన్ మార్కెట్ కు మరో స్థలం చూపించాలి

సబ్ స్టేషన్ ముందు ప్రమాదకరం.

వ్యాపారులకు ప్రజలకు విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం..



**కామారెడ్డి జిల్లా ప్రతి నిధి సెప్టెంబర్ 30(పోరు తెలంగాణ న్యూస్ :)** : దోమకొండ మండల కేంద్రంలో మటన్ మార్కెట్ కోసం సబ్ స్టేషన్ వెనకాల చూపిస్తున్న స్థలంలో ప్రమాదం జరుగుతుందని ప్రజలకు మటన్ వ్యాపారులకు విద్యుత్ ప్రమాదం జరిగే అవకాశం ఉందని వర్షాకాలం ప్రమాదకరమని దోమకొండ మటన్ వ్యాపారులు చెప్పారు. బుధవారం మటన్ వ్యాపారులు గ్రామపంచాయతీ చూపించిన స్థలంలో మాట్లాడారు. కామారెడ్డి తర్వాత దోమకొండ అతిపెద్ద మటన్ విక్రయ కేంద్రం అని ప్రస్తుతం ఉన్న మటన్ మార్కెట్ స్థలాన్ని విద్యుత్ సబ్ స్టేషన్ వెనకాల చూపించారు చూపించారని అది ప్రమాదకరమని వర్షాకాలంలో విద్యుత్ కలిగే ఇతర ప్రమాదాలు ఉన్నాయని అతి తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు ఉన్నాయని మటన్ మార్కెట్ కోసం మరో స్థలాన్ని చూపించాలని సర్పంచ్ గ్రామపంచాయతీ పాలకవర్గానికి దోమకొండ మటన్ వ్యాపారులు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం చూపించిన స్థలం ప్రజలకు మటన్ కొనుగోలు చేసే వారికి మటన్ వ్యాపారులకు ప్రమాదకరమని మరో స్థలం చూపించాలని కోరారు. గ్రామపంచాయతీ సర్పంచ్ చూపించిన స్థలంలో ఫోన్ పే పని చేయలేదు నెట్వర్క్ సిగ్నల్ రాదని పొలాలలో అడవిలో చూపించారని మరో స్థలం కావాలని సర్పంచ్ నరసయ్యను కోరారు.

## కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ. భద్రాచలం ఎమ్మెల్యే



**దుమ్ముగూడెం సెప్టెంబర్ 30 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** దుమ్ముగూడెం మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగాఇటీవల వివాహం చేసుకుని కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకానికి దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారుల కుటుంబానికి మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అధికారుల సమన్వయంతో లబ్ధిదారులకు అందజేశారు. అలాగే అర్హులైన కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులను కూడా పంపిణీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## మడకలో పౌర హక్కుల దినోత్సవం



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపల్లి జిల్లా సెప్టెంబర్ 30 ఓదెల మండలం మడక గ్రామంలో బుధవారం ఎస్సీ కాలనీలో రెవెన్యూ అధికారులు పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు . ఎస్టి, ఎస్సీలపై అత్యాచారాలు, అంటరానితనం నివారణపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆవాల ప్రసాద్, గ్రామ కార్యదర్శి, జిపిఓ, పోలీస్ శాఖ, హాస్టల్ వెల్ఫేర్ అధికారి, మండల అధికారులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కును అందజేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**కొత్తగూడెం సెప్టెంబర్ 30 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి. కూరపాటి దాసు :** జిల్లా స్పెషల్ బ్రాంచ్ విభాగంలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఇటీవల మరణించిన హెడ్ కానిస్టేబుల్ హరి గోపాల్ కుటుంబానికి బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తన కార్యాలయంలో చెక్కు రూపంలో 1,00,000/-(లక్ష రూపాయల) నగదును అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో నిరంతరం విధులు నిర్వర్తించే అధికారులు మరియు సిబ్బంది తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.మరణించిన పోలీసుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు.ప్రభుత్వం తరపున మరణించిన పోలీసు అధికారుల కుటుంబాలకు అందవలసిన అన్ని రకాల ప్రతిఫలాలను త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులకు సూచించారు.

## సహకార సంఘాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తా

రైతులు సంఘం నిర్మాణంలో భాగస్వాములు కావాలి

సహకార బ్యాంకు చైర్మన్ మంచె పాండు యాదవ్..





**మహేశ్వరం సెప్టెంబర్ 30, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** సహకార సంఘాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపిస్తానని చైర్మన్ మంచె పాండు యాదవ్ అన్నారు. బుధవారం మహేశ్వరం సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మంచె పాండు యాదవ్ మాట్లాడుతూ.. రైతులు పొలాలలో పంటలు వేసేటప్పుడు ఏం పంటలు వేస్తామనేది ముందస్తుగా నిర్ణయించుకొని ముందుకు సాగాలని ఆయన సూచించారు. సంఘంలో సభ్యత్వం ఉన్నవారికి ఐదు నుండి ఆరు లక్షల వరకు లోన్ లను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎల్ నీలో ప్రభావం వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గ చూపాలని సూచించారు. రైతులకు పనిముట్లు, ఎరువులు, పండ్లతోటలు, కార్లకు లోన్లను ఇవ్వడం జరుగుతుందని అన్నారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చేందుకు కృషి చేస్తామని ఆయన వెల్లడించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. రైతులు ఆర్థికంగా నిలబడేందుకు సంఘం సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో 750 మంది రైతులకు బాండ్లను ఇవ్వడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. రైతులు సకాలంలో క్రాప్ లోన్లను విధిగా చెల్లించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కాడమోని ప్రభాకర్, పోల్కం బాలయ్య, ఆవుల నరసింహ, సత్యనారాయణ, జంగయ్య, నరసమ్మ సీనియర్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్, సీఈఓ షఫీ రైతులు పాల్గొన్నారు.

## ఎన్నికలకు సిద్ధం కావాలి

మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి..



**మహేశ్వరం, సెప్టెంబర్ 30, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కార్యకర్తలు సమాయత్తం కావాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే, సబిత ఇంద్రారెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారందరి ఓట్లను పెద్ద ఎత్తున నమోదు చేయించాలని ఆమె కార్యకర్తలకు సూచించారు. మహేశ్వరం నియోజకవర్గం జిల్లెలగూడ సామ యాదిరెడ్డి గార్డెన్స్‌లో మహబూబ్‌నగర్, హైదరాబాద్,రంగారెడ్డి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నిర్వహించిన మహేశ్వరం నియోజకవర్గ కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలోని గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ప్రతి ఒక్కరిని గుర్తించి, అర్హత ఉన్న వారందరి ఓట్లను పెద్ద ఎత్తున నమోదు చేయించేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్యకర్తలందరి సహాయ సహకారాలు, కృషితో సురభి వాణీదేవిని గెలిపించుకోవడం జరిగిందని ఆమె గుర్తుచేశారు. అదే పోరాట స్ఫూర్తితో రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. అభ్యర్థి ఎవరైనా కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తూ ముందుకు సాగాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేసి పట్టభద్రుల ఓట్ల నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## "చెత్తను తొలగించే చేతులు గ్రామ ఆరోగ్యాన్ని కాపాడే చేతులు."

గ్రామపంచాయతీ కార్మికుల సేవలు వెలకట్టలేనివి..!

సర్పంచ్ భూరెడ్డి స్వాతి వెంకటరెడ్డి..

స్వచ్ఛ భారత్‌లో భాగంగా పంచాయతీ సిబ్బందికి

ఘన సన్మానం వైద్య పరీక్షలు





**భద్రాద్రి కొత్తగూడెం,పోరు తెలంగాణ- పినపాక నియోజకవర్గం (ప్రతినిధి- వల్లెపోగు రాము) అశ్వాపురం సెప్టెంబర్ 30 :-** అశ్వాపురం: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం రామచంద్రపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సిబ్బందికి ఘన సన్మానం నిర్వహించి కార్మికులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి,ఈ సందర్భంలో సర్పంచ్ భూరెడ్డి స్వాతి మాట్లాడుతూ.. గ్రామ పరిశుభ్రత,పారిశుద్ధ్య పరిరక్షణలో నిరంతరం సేవలందిస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల సేవలు వెలకట్టలేనివని అని "పరిశుభ్రమైన గ్రామం వెనుక.. పారిశుద్ధ్య కార్మికుల నిరంతర శ్రమ ఉంటుంది." "వారి పని కనిపించకపోవచ్చు.. కానీ వారి సేవల ఫలితం ప్రతి ఇంటికీ కనిపిస్తుంది." "ఎండైనా.. వానైనా.. గ్రామ పరిశుభ్రతే లక్ష్యంగా పనిచేసే కార్మికులకు సెల్యూట్." "స్వచ్ఛ గ్రామానికి బాటలు వేసేది పాలన మాత్రమే కాదు.. ప్రతిరోజూ శ్రమించే పారిశుద్ధ్య కార్మికులే."ప్రతిరోజూ ప్రజల ఆరోగ్యం కోసం కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు సమాజానికి ఎంతో విలువైనవని అన్నారు. వారి సేవలను గ్రామ ప్రజల తరపున అభినందిస్తూ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. "ప్రజల ఆరోగ్యం కోసం ముందుండి పనిచేసే పారిశుద్ధ్య కార్మికులే గ్రామ పరిశుభ్రతకు నిజమైన కాపలాదారులు. వారి సేవలకు ఎంత గౌరవం ఇచ్చినా తక్కువే." అని సర్పంచ్ పేర్కొన్నారు. అనంతరం ఆచీవీలు, ఆశా వర్కర్లు పంచాయతీ సిబ్బందికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించారు.ఆరోగ్య పరిరక్షణ,వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి,ఉపసర్పంచ్,వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, ఆచీవీలు,ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతనాల జీవో నెం.6ను వెంటనే అమలు చేయాలి

టీ యూసీఐ జిల్లా కమిటీ డిమాండ్



కనీస వేతనాల జీవో నెం.6ను అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఆ ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. సంఘటిత, అసంఘటిత

**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, సెప్టెంబర్ 30(పోరు తెలంగాణ ప్రతినిధి,జీవిరత్నం):** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కనీస వేతనాల జీవో నెం.6ను వెంటనే అమలు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు టీయూసీఐ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ పిలుపు మేరకు జిల్లా కమిటీ ప్రతినిధుల బృందం కలెక్టరేట్‌లో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ (ఏసీఎల్)కు బుధవారం వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి నూపా భాస్కర్ మాట్లాడుతూ.. జీవో నెం.6 అమలుకు ప్రత్యేక స్క్వాడ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలోని 73 షెడ్యూల్డ్ కనీస వేతనాల జీవోలలో 67 జీవోలను ఒకే జీవో పరిధిలోకి తీసుకువచ్చి, జూన్ 1 నుంచి రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులతో పాటు గ్రామపంచాయతీలు, షాపులు, పెట్రోల్ బంకులు, బట్టల దుకాణాలు, ఆటోమొబైల్ తదితర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు జీవో నెం.6 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌ల రూపంలో మార్చడం ద్వారా కార్మిక హక్కులకు నష్టం కలిగించిందని భాస్కర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీవో నెం.6ను అమలు చేసి కార్మికులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో కార్మిక వర్గం మొత్తం ఉద్యమ బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షులు గోనెల రమేష్, ఎదులాపురం గోపాల్‌రావు, రాజశేఖర్, వి. రమేష్, శ్రీహరి, పుల్లయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## భూ రీ సర్వేను సకాలంలో పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ అంకిత్





**కొత్తగూడెం సెప్టెంబర్ 30 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** చుంచుపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం విస్తృతంగా పర్యటించి భూ రీ సర్వే ప్రక్రియను పరిశీలించడంతో పాటు చుంచుపల్లి తండా ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా చుంచుపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, సర్వే పురోగతి, భూ సరిహద్దుల నిర్ధారణ, రికార్డుల పరిశీలనకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చుంచుపల్లి గ్రామ పరిధిలో మొత్తం 2 వేల 27 ఎకరాల 30 గుంటల భూమి ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ భూములతో పాటు వ్యవసాయ భూముల భూ రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో భూ సరిహద్దులను ఖచ్చితంగా నిర్ధారించడంతో పాటు, సంబంధిత రికార్డులను సమగ్రంగా పరిశీలించి భూముల వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం చుంచుపల్లి తండా ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, విద్యాబోధన, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యా ప్రగతిని, పాఠ్యాంశాలపై అవగాహనను తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతంపై ప్రత్యేక దృష్టి సారించి, పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మేధో వైకల్యం కలిగిన విద్యార్థులను గుర్తించి, వారి విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలకు హాజరు కావడంలో ఇబ్బందులు ఎదుర్కొనే అటువంటి విద్యార్థులకు ఇంటి వద్దే విద్యాబోధన అందించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి విద్యార్థి విద్యకు దూరం కాకుండా, వారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం, తాగునీరు, పారిశుధ్యం తదితర సదుపాయాలను వివరాలను అడిగి తెలుసుకున్నారు . పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగిస్తూ విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా నాణ్యమైన విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. భూ రీ సర్వేను సకాలంలో పూర్తి చేయడంతో పాటు, పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ నాగరాజు, సర్వే అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి







జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**పోరు తెలంగాణ, మంచిర్యాల,సెప్టెంబర్ 30, 2026:** సాధారణంగా సాగుచేసే వరి పత్తి మొక్కజొన్న కాకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కిసాన్ మేళా కార్యక్రమానికి సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, కృషి విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు మహేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు రత్నం సుకుమారి, రామగిరి బానేష్, అక్కల వెంకటేశ్వర్లు, దుర్గం లక్ష్మీనారాయణ, మహేష్ ప్రసాద్ తివారి, ఆత్మ చైర్మన్ లు ఆర్. సత్తయ్య, ఓడేటి హనుమంతు, సింగతి మురళి, రఘునందన్ రెడ్డి లతో కలిసి హాజరై స్టాళ్లను పరిశీలించి, మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు వరి, పత్తి పంటలతో పాటు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండి అధిక లాభాలను అందించే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు. ఫర్టిలైజర్స్, సేంద్రియ వ్యవసాయం, పామాయిల్ సాగు, డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థలు, మత్స్యశాఖకు సంబంధించిన ఉత్పత్తులు, వ్యవసాయానికి ఉపయోగపడే ఎలక్ట్రానిక్ వాహనాలు రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. సాంకేతికతతో రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించాలని, ఆధునిక వ్యవసాయ సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకుని, ఉత్పాదకతను పెంచుకోవచ్చని రైతులకు సూచించారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్ పరిస్థితులు, పంటలకు లభించే ధరలు, సాగు వ్యయం, నీటి లభ్యత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని అధిక లాభాలను అందించే పంటలను ఎంచుకోవాలని తెలిపారు. ఆయిల్ పామ్, పందిరి సాగు, పండ్ల సాగు వంటి పంటలపై దృష్టి సారించేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకంలో అందిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకారుల కొరకు చేప పిల్లలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిందని తెలిపారు. ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని సాగు ప్రణాళిక పకడ్బందీగా చేసుకోవాలని, నానో యూరియా, నానో డి ఎ పి వినియోగం వలన కలిగే లాభాలను రైతులకు వివరించాలని తెలిపారు. రైతుల కొరకు జిల్లాలోని లక్సెట్టిపేటలో విత్తన శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులు తెలుసుకోవాలని తెలిపారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న రాయితీ, సహకారాన్ని రైతులకు వివరించి పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆరోగ్యమైన పంట ఉత్పాదకత పెంపొందించేలా అధికారులు, స్వయం సహాయక సంఘాల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. సిర్పూర్ శాసనసభ్యులు మాట్లాడుతూ రైతులు సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవాలని, ప్రజలకు ఆరోగ్యకరమైన, సహజసిద్ధమైన పంట ఉత్పత్తులను అందించేలా కృషి చేయాలని తెలిపారు. వరి, మొక్క, పత్తి వంటి సాధారణ పంటలే కాకుండా ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కల్పిస్తున్న అవకాశాలపై రైతులు చైతన్యవంతులు కావాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, అధికారులు అందిస్తున్న పంట మెలకువలు, సూచనలను పాటిస్తూ తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ పంట దిగుబడి సాధించి, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా రైతులు ముందుకు రావాలని తెలిపారు.

## దశలవారీగా అభివృద్ధి పనులు



సర్పంచ్ చేపంగి ప్రవీణ్..

**మహేశ్వరం, సెప్టెంబర్ 30, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** దశలవారీగా అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని కోళ్ల పడకల్ గ్రామ సర్పంచ్ చేపంగి ప్రవీణ్ తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వి బి జి రాంజీ పథకం ద్వారా చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. గ్రామంలో ఇంకుడు గుంతలు, పొలాలకు వెళ్లడానికి రోడ్లు, ప్రభుత్వ భవనాలను నిర్మించడం, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, ఇంకుడు గుంతలను నిర్మించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. వి బి జి రామ్ జి ద్వారా నిర్వహించే ఉపాధి పనులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరు అభివృద్ధి చెందితేనే గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆవుల మల్లేష్, సెక్రటరీ మహేష్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఆనందపురంలో 'స్వచ్ఛతా హీ సేవా' స్ఫూర్తి: పారిశుద్ధ్య కార్మికులకు ఘన సత్కారం

గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఎంపీడబ్ల్యూలకు ఆరోగ్య పరీక్షలు, పీపీఈ కిట్ల పంపిణీ

రహదారులు, ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కల నివారణకు ముమ్మరంగా చర్యలు

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి: సర్పంచ్ ముర్రం సమ్మయ్య






**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి-వల్లెపోగు రాము) అశ్వాపురం,సెప్టెంబర్ 30 :-** గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చేపట్టిన 'స్వచ్ఛతా హీ సేవా -- 2026' కార్యక్రమంలో భాగంగా ఆనందపురం గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ముర్రం సమ్మయ్య, ఉప సర్పంచ్ దేవనబోయిన మహేష్, పంచాయతీ కార్యదర్శి వేణు ప్రియా, సమక్షంలో గ్రామంలో పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయడంతో పాటు గ్రామ పరిశుభ్రతకు రేయింబవళ్లు శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. ?వర్షాకాలం నేపథ్యంలో గ్రామంలో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగి దోమలు, విషపురుగులు వ్యాపించకుండా గ్రామపంచాయతీ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గ్రామంలోని అన్ని ప్రధాన, అంతర్గత రహదారులకిరువైపులా మరియు ఖాళీగా ఉన్న స్థలాల చుట్టూ పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, కలుపు నివారణకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గడ్డి మందును విస్తృతంగా పిచికారీ చేయించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా, వ్యాధులు ప్రబలకుండా ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాలకవర్గం సూచించింది.?స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న మల్టీపర్పస్ వర్కర్ల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. పారిశుద్ధ్య సిబ్బందికి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్య సలహాలు అందించారు. విధుల్లో ఎలాంటి ప్రమాదాలు, ఇన్ఫెక్షన్లు సోకకుండా ఉండేందుకు సిబ్బందికి సర్పంచ్, ఉప సర్పంచ్ చేతుల మీదుగా పీపీఈ కిట్లను పంపిణీ చేశారు. నిస్వార్థంగా గ్రామానికి సేవలందిస్తున్న పారిశుద్ధ్య సిబ్బందిని పంచాయతీ పాలకవర్గం శాలువాలతో ఘనంగా సత్కరించి వారి సేవలను ప్రశంసించింది. ?ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా డిజిటలైజేషన్ ను వేగవంతం చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు






**పోరు తెలంగాణ న్యూస్//మంచిర్యాల సెప్టెంబర్ 30, 2026 :** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని దండేపల్లి మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే నిర్వహించిన విచారణలకు సంబంధించిన కేసుల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలని, తదుపరి 2 రోజులలో పురోగతిని స్పష్టంగా చూపించాలని అధికారులను ఆదేశించారు. సాదాబైనామా, భూ భారతి దరఖాస్తులపై సమీక్ష నిర్వహించి పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను అనుసరించి నియమ నిబంధనల ప్రకారం పరిష్కరించాలని, మీ-సేవా ధ్రువపత్రాలను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి, నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని తెలిపారు. అంతకుముందు జిల్లాలోని జన్నారం మండల కేంద్రంలో గల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రైండ్లగూడ గ్రామంలోని సర్వే నంబర్లు 160, 161 కి సంబంధించిన "అల్లం వారి కుంట" అంశంపై ప్రజావాణిలో అందిన ఫిర్యాదుపై కలెక్టరేట్ సూపరింటెండెంట్-బి, జన్నారం నీటిపారుదల శాఖ ఎఈఈ లతో కలిసి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఫిర్యాదుదారుల వాదనలు విని, సమస్యకు సంబంధించిన అంశాలను పరిశీలించి, జన్నారం తహసిల్దార్, మండల గిర్దావర్‌కు తదుపరి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళా స్వయం ఉపాధికి ఎస్‌పీఎం సీఎస్ఆర్ ప్రోత్సాహం

భట్టుపల్లిలో 45 రోజుల కుట్టు శిక్షణ పూర్తి.....

**పోరు తెలంగాణ సెప్టెంబర్ 30: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో కాగజ్ నగర్ మండలం భట్టుపల్లి గ్రామంలో సిర్పూర్ పేపర్ మిల్స్ లిమిటెడ్ సామాజిక బాధ్యత కార్యక్రమాల ఆధ్వర్యంలో స్పర్శ్ సోషల్ ఫౌండేషన్ నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణను 75 మంది మహిళలు 45 రోజుల్లో పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పీఎం మానవ వనరులు, పారిశ్రామిక సంబంధాల విభాగం జనరల్ మేనేజర్ ఎం.ఎస్. గిరి శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని సూచించారు. భవిష్యత్తులో స్వయం సహాయక సంఘాల మహిళలకు మరిన్ని నైపుణ్యాభివృద్ధి, ఉపాధి ఆధారిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌పీఎం ఉప మేనేజర్ మనోహర్, స్పర్శ్ ఫౌండేషన్ ప్రతినిధులు సుశీల, శివ, సమాచార హక్కు రక్షణ చట్టం కొమురం భీం జిల్లా అధ్యక్షులు వంగరి ప్రవీణ్, శిక్షణ పొందిన మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్సీ మల్క కొమరయ్య

విద్యార్థినులతో ఎమ్మెల్సీ మల్క మాటమంతీ

పాఠశాల్లో అందుతున్న విద్య, వసతులు, బోధన తీరుపై ఆరా

ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది సమస్యల గురించి అడిగి తెలుసుకున్న మల్క



**పోరు తెలంగాణ న్యూస్// తిమ్మాపూర్// కరీంనగర్ :** మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (MJPTBCWREIS) ఆధ్వర్యంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల రెసిడెన్షియల్ స్కూల్, రావీణ ఉ దీ.రాషి. అగ్రికల్చర్ కళాశాల, తిమ్మాపూర్ను తెలంగాణ టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థినులతో ఎమ్మెల్సీ మల్క కొమరయ్య నేరుగా ముచ్చటించారు. విద్యా ప్రమాణాలు, బోధన విధానం, ఉపాధ్యాయుల పనితీరు, హాస్టల్ వసతులు, భోజనం, తాగునీరు, ఆరోగ్యం, క్రీడలు, పాఠ్యేతర కార్యక్రమాలు తదితర అంశాలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల నుంచి వారి చదువులో ఎదురవుతున్న సమస్యలు, అవసరాలు, భవిష్యత్ లక్ష్యాల గురించి తెలుసుకున్న ఆయన.. నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర వికాసానికి అవసరమైన వాతావరణం కల్పించడం అత్యంత ముఖ్యమని అన్నారు. అలాగే ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల విద్యా పురోగతి, బోధనలో ఎదురవుతున్న సవాళ్లు, పాఠశాల అభివృద్ధికి అవసరమైన చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, ప్రతి విద్యార్థి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ, నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందేలా మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని మల్క కొమరయ్య పేర్కొన్నారు. విద్యార్థుల అవసరాలు, పాఠశాల అభివృద్ధికి సంబంధించిన అంశాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యల కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా స్పోక్ పర్సన్‌గా నకిరేకంటి ఉమా




**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, సెప్టెంబర్ 30(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్పోక్ పర్సన్‌గా విద్యావేత్త, ఎల్.ఎల్.బి, ఎల్ ఎల్ ఎం పట్టభద్రురాలు నకిరేకంటి ఉమా నియమితులయ్యారు. టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు బుధవారం పాల్వంచలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ గద్దల రమేష్ ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గద్దల రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ ప్రభుత్వ పథకాలను గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు తీసుకెళ్లడంలో యువ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. పార్టీ పట్ల నకిరేకంటి ఉమా చూపిన అంకితభావం, క్రియాశీలకంగా పనిచేసిన తీరును పరిగణనలోకి తీసుకుని ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. జిల్లాలోని ఎస్సీ వర్గాల సమస్యలపై నిరంతరం పనిచేస్తూ, పార్టీ బలోపేతానికి ఆమె కృషి చేస్తారనే విశ్వాసం వ్యక్తం చేశారు. నూతన బాధ్యతలు స్వీకరించిన నకిరేకంటి ఉమా మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గద్దల రమేష్, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలను విస్తరించడంతో పాటు ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారం, వారి అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా జనరల్ సెక్రెటరీ ధార చిరంజీవి, పాల్వంచ టౌన్ అధ్యక్షుడు గోలి సదాశివ, బిల్లా సుజిత్, బొల్లెపోగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఆత్మీయురాలిగా అంత్యక్రియలకు ఖర్చులకు ఆర్థిక సహాయం

మొండికుంట సర్పంచ్ మర్రి సంధ్య ఔదార్యం



**భద్రాద్రి కొత్తగూడెం, (పోరు తెలంగాణ పినపాక నియోజకవర్గం ప్రతినిధి) అశ్వాపురం,సెప్టెంబర్ 30:-** ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తానని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని మొండికుంట సర్పంచ్ మర్రి సంధ్య ఆచరణలో చేసి చూపిస్తున్నారు. పేద కుటుంబాలకు చేదోడువాదోడుగా ఉంటూ, కష్టకాలంలో వారికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. బుధవారం మొండికుంట గ్రామానికి చెందిన సోయం బోడయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న సర్పంచ్ మర్రి సంధ్య వారి కుటుంబాన్ని పరామర్శించారు. బోడయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించి,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా తనవంతు సహాయంగా రూ.5,000 ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని ఆమె భరోసా ఇచ్చారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా పేదల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్న సర్పంచ్ మర్రి సంధ్యను గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చలమల్ల శివారెడ్డి,మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి,బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాసరబాద శ్రీనివాస్,పాటి మన్మధ రెడ్డి,రామగిరి భాస్కర్, ఎంగలి బిక్షం రెడ్డి,అంబటి కర్ర శ్రీను,తెల్లం లాలయ్య పాయం ఎర్రయ్య, సోయం సాంబయ్య, సోయంవెంకన్న, పర్సిక వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# రాంనగర్ సెక్టార్‌లో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం

జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్





**పోరు తెలంగాణ న్యూస్//మంచిర్యాల సెప్టెంబర్ 30, 2026 :** మహిళ, శిశు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం పోషణ మాసం కార్యక్రమాన్ని అమలు చేస్తుందని, ఈ క్రమంలో బుధవారం మంచిర్యాల పట్టణంలోని రాంనగర్ సెక్టార్ లో పోషణ మాసం ను ఘనంగా నిర్వహించడం జరిగిందని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ అన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, డివిజన్ కార్పొరేటర్ శ్రీలక్ష్మి, సి డి పి ఓ విష్ణుప్రియ, సూపర్‌వైజర్ జ్యోతి లతో కలిసి గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు సమతుల్యమైన పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవన విధానాలను చిన్ననాటి నుంచే అలవర్చాలని తెలిపారు. పోషణ మాసం కార్యక్రమం ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులలో పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, పరిశుభ్రత, ప్రారంభ విద్యపై అవగాహన మరింత పెంచాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యకరమైన తరం నిర్మాణానికి తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది, అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

**అనంతరం గర్భిణీలకు శ్రీమంతాల కార్యక్రమం, చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు.**

ఈ కార్యక్రమంలో బి.సి. సతీష్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు, గర్భిణీలు, చిన్నారులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ బాలికల గురుకులాల్లో డీడీ ఆకస్మిక తనిఖీ....





**పోరు తెలంగాణ సెప్టెంబర్ 30: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** ఆసిఫాబాద్‌లోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను జిల్లా గిరిజన సంక్షేమ ఉప సంచాలకుడు జాదవ్ అంబాజీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినుల హాజరు, బోధన, వసతి గృహం, భోజనశాల, వంటశాల, పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సదుపాయాలు, భద్రత చర్యలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడి చదువు, భోజన నాణ్యత, వసతి, ఆరోగ్యం, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థినికి నాణ్యమైన విద్య, మెరుగైన వసతి, పౌష్టికాహారం అందేలా ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, బాలికల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విద్యార్థినుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని సిబ్బందికి చెప్పారు. మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే గిరిజన సంక్షేమ శాఖ లక్ష్యమని స్పష్టం చేశారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలి





జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**పోరు తెలంగాణ న్యూస్//మంచిర్యాల సెప్టెంబర్ 30, 2026 :** ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నెన్నెల మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు, వంటశాల, తరగతి గదులు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు మెనూ ప్రకారం సకాలంలో రుచికరమైన పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న కార్యక్రమాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.